ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
గురువారం 25 జనవరి 2024

జేఈఈ మెయిన్స్ ప్రారంభం

ఎచ్చెర్ల, జనవరి 24: ఐఐటీ, ఎన్ఐటీలో ప్రవేశాలకు సంబంధించి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో జిల్లాలో బుధవారం జేఈఈ మెయిన్స్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. శ్రీశివానీ ఇంజనీరింగ్ కళాశాల (చిలకపాలెం)లో ఆన్‌లైన్‌లో జరిగిన పేపర్-2కు 71 మందికి అభ్యర్థులకు 66 మంది హాజరయ్యారు. పేపర్- 1 పరీక్షలు ఈ నెల 27, 29, 30, 31న, వచ్చే నెల ఒకటో తేదీన జిల్లాలోని శ్రీశివానీ, శ్రీవెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలల్లో రెండు షిఫ్టుల్లో ఆన్‌లైన్‌లో జరగనున్నాయి. దీనికోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.



పీసీసీ అధ్యక్షురాలు షర్మిలతో కరచాలనం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు (ఫైల్)

వైసీపీలో వణికు

- కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమవుతున్న ద్వితీయ స్థాయి నాయకులు
- ఇప్పటికే షర్మిల సమక్షంలో చేరిన ఇచ్ఛాపురం ఎంపీటీసీ
- వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్పదని అధికార పార్టీలో భయం

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల జిల్లా పర్యటనతో అధికార పార్టీలో వణుకు మొదలైంది. ఇంతవరకు టీడీపీ మాత్రమే ప్రతిపక్షంగా భావించిన వైసీపీకి ఇప్పుడు షర్మిల రూపంలో కొత్త రాజకీయ ప్రత్యర్థి తగలడంతో అధికార పార్టీ నేతల్లో గుబులు నెలకొంది. ఎక్కడ ఓట్లు చీలుతాయోనని ఆందోళన చెందుతున్నారు. ఈ నెల 23న వైఎస్ షర్మిల పీసీసీ అధ్యక్షురాలి హోదాలో జిల్లా పర్యటనకు వచ్చిన విషయం విదితమే. ఆమె వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు కొంతమంది ఉన్నప్పటికీ.. ఇచ్ఛాపురంలో నిర్వహించిన కార్యకర్తల సభలో పాల్గొన్న జనంలో అత్యధిక మంది వైసీపీకి చెందిన సానుభూతిపరులే. అలాగే నరసన్నపేట, టెక్కలి, పలాస వద్ద షర్మిలకు స్వాగతం చెప్పిన నాయకుల వెనుకున్న వారిలో కూడా ఎక్కువ మంది వైసీపీ సానుభూతిపరులే. ఇప్పుడే ఇలా ఉంటే ఎన్నికల నాటికి పరిస్థితి ఎలా ఉంటుందోనని అధికార పార్టీ నేతలు కలవరపడుతున్నారు.

అసంతృప్త నేతలకు ప్రత్యామ్నాయంగా...

వైసీపీకి సేవలందించి, పార్టీని అధికారంలోకి తీసుకువ చ్చేందుకు శ్రమించినవారికి ఆశించిన స్థాయిలో పదవులు లభించలేదు. పార్టీపరంగాను కొందరికి గుర్తింపు లేదు. ఇలాంటి వారు కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి వంటివా రు ఉన్నారు. పాతపట్నం, ఎచ్చెర్ల నియోజకవర్గాల్లో వైసీపీ ఎమ్మెల్యేలపై సొంత పార్టీ నేతల్లో తీవ్ర అసంతృప్తి ఉంది. ఇప్పటికే ఆ ఇద్దరి ఎమ్మెల్యేలకు వ్యతిరేకంగా గ్రామ, మండల స్థాయిల్లో ఆందోళనలు చేపట్టారు. ఈ ఎమ్మెల్యేలు మాకొద్దు.. జగన్ మాత్రం ముద్దు అంటూ నిరసనలు తెలియజేశారు. వీరికి టిక్కెట్లు ఇస్తే ఓడించి తీరుతామని స్పష్టంచేశారు.

ఎచ్చెర్ల వైసీపీ నాయకులు ఏకంగా అధిష్ఠానం వద్దకు వెళ్లి ఎమ్మెల్యే కిరణ్ వద్దంటూ తెగేసి చెప్పారు. అధిష్ఠానం ఈ ఇద్దరి ఎమ్మెల్యే టిక్కెట్లు మార్చకుంటే ఎన్నికల సమయానికి ప్రత్యామ్నాయంగా వైఎస్ షర్మిల వెంట వెళ్లే ఆలోచనలో వైసీపీ ద్వితీయ కేడర్ ఉన్నట్లు సమాచారం. అధికార పార్టీ ఓటమికి సొంతపార్టీ నాయకులే పని చేసే అవకాశం ఉంది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థులను నిలబెడుతుందని షర్మిల చెప్పారు. వీరికి పార్టీ సహకారం అందిస్తుందనే ప్రచారం కూడా జోరందుకుంది. ఇదేగానీ జరిగితే ఓట్ల చీలిక తప్పదు. ఇది తమ ఓటమిని శాసిస్తుందని వైసీపీ నేతలు భయపడుతున్నారు.

టీడీపీకి అన్నీ మంచి శకునాలే...

తెలుగుదేశం పార్టీకి ప్రస్తుతం అన్నీ మంచి శకునాలే కలసివస్తున్నాయి. వైసీపీపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉంది. ఆపై ఆ పార్టీలోనే వర్గపోరు తీవ్రతరమైంది. ఇదే సమయంలో టీడీపీ వివిధ కార్యక్రమాలు చేపడుతూ అన్ని నియోజకవర్గాల్లోనూ బలపడింది. గత ఎన్నికల్లో స్వల్ప మెజార్టీతో కోల్పోయిన ఎమ్మెల్యే సీట్లను సైతం ఈ దఫా కైవసం చేసుకోనున్నట్లు ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. గత ఎన్నికల్లో శ్రీకాకుళం నియోజకవర్గంలో జనసేనకు పోలైన ఓట్లలో సగం ఓట్లు టీడీపీకి పోలై ఉంటే గుండ లక్ష్మీదేవి గెలుపొందేవారని, ఈసారి టీడీపీ-జనసేన పొత్తు వల్ల టీడీపీ అభ్యర్థి గెలుపు నల్లేరుపై నడకేనని చెబుతున్నారు. పాతపట్నం నియోజకవర్గంలో ప్రధానంగా వంశధార నిర్వాసితులు ప్యాకేజీ విషయంలో ప్రభుత్వంపై గుర్రుగా ఉన్నారు. పలాస వైసీపీలో వర్గవిభేదాలు తారాస్థాయికి చేరాయి. మంత్రి సీదిరిని ఓ వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. గత ఎన్నికల్లో ఓటమి చెందిన వైసీపీ అభ్యర్థులకే మరలా టిక్కెట్ ఖరారు అయ్యేలా ప్రాథమికంగా ఇన్‌చార్జిలను నియమించారు. అప్పటికంటే ఇప్పుడు వారిపై వ్యతిరేకత పెరిగింది. అలాగే గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీకి కనీసం వైసీపీ నుంచే యాభై మందైనా అభిమానం చూపించొచ్చు. ఇవి ఓట్ల రూపంలో అధికార పార్టీ విజయానికి గండి కొడతాయి. ఇచ్ఛాపురంలో జరిగిన షర్మిల సభలో ఓ వైసీపీ ఎమ్పీటీసీ పాల్గొని తనకు జగన్ అంటే అభిమానం ఉన్నప్పటికీ విడిచిపెట్టేసి కాంగ్రెస్‌లో చేరానని చెప్పారు. మరికొంతమంది వైసీపీ నాయకులు తనతో చేరేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ కాంట్రాక్టు పనులు చేపట్టినందుకుగాను ప్రభుత్వం నుంచి రావాల్సిన బిల్లుల విషయం ఆలోచించి వెనకడుగు వేస్తున్నారని, త్వరలో వారుకూడా కాంగ్రెస్‌లో చేరిపోతారని సభలో వెల్లడించారు. ఈ రెండుమాసాల్లో ఇటువంటివి ఇంకా జరగవచ్చు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయావకాశాల సంగతి అలా ఉంచితే.. ప్రధాన ముప్పు వైసీపీకే. దీంతో టీడీపీకి అన్నివిధాలా కలసివస్తోంది.

రాష్ట్రంలో విధ్వంసకర పాలన

- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు

సంతబొమ్మాళి, జనవరి 24: రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్ విధ్వంసకర పాలన సాగిస్తున్నాడని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు ధ్వజమెత్తారు. బుధవారం రాత్రి మండలంలోని కాకరాపల్లిలో ఆయన పర్యటించారు. ఒక్క అవకాశం ఇవ్వాలని మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్.. రాష్ట్రంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధ్వంసకర పాలన చేస్తున్నాడని విమర్శించారు. వైసీపీ పాలనలో ఐదు కోట్ల మంది ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఏ ప్రభుత్వమైనా సంపద సృష్టించి అభివృద్ధి, సంక్షేమం సమాంతరంగా అమలు చేయాలని తెలిపారు. కానీ, వైసీపీ ప్రభుత్వం మాత్రం ప్రతి మంగళవారం అప్పులు చేస్తూ రాష్ట్రాన్ని పూర్తిగా దివాళా తీసే స్థాయికి తీసుకువెళ్లిందని విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి చూస్తుంటే రాష్ట్ర భవిష్యత్తుపై ఆందోళనగా ఉందన్నారు. రాష్ట్రానికి వస్తున్న సంపద అంతా అప్పులు కట్టడానికే సరిపోతుందని, ఉద్యోగులకు సకాలంలో జీతాలు కూడా ఇవ్వలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని ధ్వజమెత్తారు. దీనిబట్టి రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతుంద న్నారు. రాష్ట్రంలో నాణ్యత లేని మద్యాన్ని అమ్ముతున్నారని, ఈ మద్యం తాగి రాష్ట్రంలో 36వేల మంది మృతి చెందారని తెలిపారు. మద్య సొమ్ము తాడేపల్లి క్యాంప్ ఆఫీస్‌కు చేరుతుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు జీరు భీమారావు, రెడ్డి అప్పన్న, కింజరాపు హరిప్రసాద్, చిదపాన దర్మార్జునరెడ్డి, పల్లి జోగారావు, వెలమల కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అచ్చెన్నాయుడు

ఆ శాఖ మంత్రి జిల్లా వాసే.. ఏం ప్రయోజనం?

- మొక్కుబడిగా వైఎస్సార్ పశుబీమా పథకం
- జిల్లాకు రెండో విడత రూ.40లక్షలు మాత్రమే
- ప్రభుత్వంపై పాడిరైతుల తీవ్ర అసంతృప్తి

(టెక్కలి)

రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ పశు బీమాకు మొక్కుబడిగా సబ్సిడీ నిధులు విడుదల చేయడంతో జిల్లాలో పాడిరైతులు పెదవి విరుస్తున్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం వైఎస్ఆర్ పశు నష్టపరిహారం పథకం పెట్టి 2022 డిసెంబరు 30 వరకు కొనసాగించింది. అయితే మృత్యువాత చెందిన పశువులకు సంబంధించి పాడిరైతులకు ఇన్సూరెన్స్ చెల్లించడంలో విఫలమైంది. పశువులు మృత్యువాత చెంది ఏడాది దాటినా కొంతమంది రైతులకు ఇంకా ఇన్సూరెన్స్ అందని పరిస్థితి నెలకొంది. సంబంధిత శాఖా మంత్రి సీదిరి అప్పలరాజు ఈ జిల్లాకు చెందిన వారైనా పాడి రైతులపై కరుణ లేదనే వాదన వినిపిస్తోంది.



నర్సింగపల్లిలో ఆవుకు బీమా చేస్తున్న గ్రామీణ పశు సహాయకులు (ఫైల్)

పశు బీమా పథకానికి సంబంధించి రైతువాటా 20శాతం, ప్రభుత్వం వాటా 80శాతం కలిపి ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలకుగాను ఈ విడత రాష్ట్ర ప్రభుత్వం రూ.40లక్షలు జిల్లాకు కేటాయించింది. గతేడాది జిల్లాలో సుమారు 14 లక్షల ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలకు సంబంధించి రూ.1.56 కోట్లు బీమా చేసేందుకు ప్రభుత్వం తరఫున కేటాయించారు. ఈ నిధులతో గత ఏడాది జిల్లాలో సుమారు 9,200 ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలకు మొక్కుబడిగా పశుసంవర్ధకశాఖ అధికారులు పాడిరైతుల వద్దకు వెళ్లి ఇన్సూరెన్స్ చేయించారు. జిల్లాలో లక్షల సంఖ్యలో పశువులు ఉంటే వేల సంఖ్యలో కూడా ఇన్సూరెన్స్ ప్రక్రియ జరిపించక పోవడంపై పాడిరైతులు మండిపడ్డారు. ఈసారి జిల్లాలో 13.89 లక్షలకుపైగా ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు ఉంటే రూ.40లక్షలు మాత్రమే పశు బీమా నిధులు కేటాయించడం ఎంతవరకు సబబని ప్రశ్నిస్తున్నారు. జిల్లాలో పశు సంవర్ధకశాఖ మంత్రి ఉన్నా.. తమకు న్యాయం జరగడం లేదని వాపోతున్నారు. ఈ విషయమై పశు సంవర్ధకశాఖ జేడీ డాక్టర్ కిషోర్ వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా.. ఈ విడత జిల్లాకు రూ.40లక్షల సబ్సిడీ నిధులు విడుదలయ్యాయని తెలిపారు. ఈ నిధుల మేరకు పశువులకు బీమా కల్పిస్తున్నామని తెలిపారు.

ప్రీమియం ఇలా..

- వైఎస్సార్ పశుబీమా పథకం కిందట బియ్యం కార్డు కలిగిన పాడి రైతులు మూడేళ్లకుగానూ ఒక ఈత గల ఆవు/ఎద్దుకు రూ.30వేల ప్రీమియానికిగానూ రూ.384 చొప్పున చెల్లించాలి. అదే రూ.15వేల ప్రీమియమైతే రూ.192 చెల్లించాలి. కార్డు లేనివారు రూ.30వేల ప్రీమియానికి రూ.960, రూ.15వేల ప్రీమియానికి రూ.480 చెల్లించాల్సి ఉంటుంది. గొర్రెలు, మేకలకు సంబంధించి లబ్ధిదారుడు ఏడాదికి రూ.36 చొప్పున చెల్లించాలి. గ్రామస్థాయిలో పశువైద్యులు, పశుసహాయక సిబ్బంది నేరుగా పాడిరైతుల వద్దకు వెళ్లి విడుదలైన సబ్సిడీ చెల్లింపులు మేరకు వివరాలు సేకరించి ఫోటోలు తీసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంది.

జిల్లాలో ఆవుల సంఖ్య:	4.50 లక్షలకు పైగా
గేదెల సంఖ్య:	48,500
మేకలు, గొర్రెలు:	9.50 లక్షలకు పైగా
తొలి విడత పశు బీమా వర్తింపు:	9,200 మూగజీవాలకు
మిగిలిన వాటికి రెండోవిడత సబ్సిడీ:	రూ.40 లక్షలు మాత్రమే



మాట్లాడుతున్న రవికుమార్

ఆసరా కాదు.. టోకరా

- రాష్ట్రంలో మహిళలకు భద్రత లేదు
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్

అరసవల్లి, జనవరి 24: 'ఆసరా పథకం పేరుతో జగన్‌రెడ్డి మహిళలకు ఇచ్చేది గోరంత.. దోచేది కొండంత. అది ఆసరా కాదు టోకరా' అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికు మార్ విమర్శించారు. నగరంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. 'డ్వాక్రా రుణమాఫీ, పసుపు కుంకుమ ద్వారా చంద్రన్న పాలనలో కోటిమంది మహిళలు ఒక్కొక్కరు రూ.20 వేలు లబ్ధి పొందారు. జగన్‌రెడ్డి పాలనలో ఒక్కొక్క మహిళ పొందిన లబ్ధి రూ.15 వేలకు తగ్గిపోయింది. ఈ రకంగా 50 లక్షల మంది డ్వాక్రా మహిళలకు జగన్ రెడ్డి టోకరా వేశారు. రాష్ట్రంలో కోటి 14 లక్షల మంది డ్వాక్రా మహిళలుంటే 79 లక్షలకే కుదించారు. ఈ రకంగా 35 లక్షల మందికి మొండిచేయి చూపారు. మద్యం రేట్లను మూడు రెట్లు పెంచి, నాసిరకం మద్యంతో 35లక్షల మంది ఆరోగ్యాలను నాశనం చేశారు. అందులో 30 వేల మంది మృత్యువాత పడ్డారు. చంద్రన్న పాలనలో రూ.5లక్షలకు సున్నా వడ్డీ వర్తింప చేస్తే దానిని జగన్ రూ.3లక్షలకు తగ్గించాడు. ఆ వడ్డీ కూడా కేంద్రమే భరిస్తోంది. మరి జగనన్న ఇచ్చింది సున్నా. అంగన్వాడీల జీతాలు చంద్రన్న రూ.6300 పెంచితే జగన్ పెంచింది కేవలం వెయ్యి రూపాయలే. జాతీయ స్థాయిలో మహిళలపై జరుగుతున్న నేరాల రేటు 66.4శాతం కాగా, ఏపీలో మాత్రం 96.2 శాతం. దీనిబట్టి మహిళా భద్రతలో రాష్ట్రం పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతుంది. మహిళలు, పిల్లల అదృశ్యం ఘటనలు రాష్ట్రంలో 53.61 శాతం పెరిగాయి. జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక మహిళలపై 2 లక్షలకు పైగా నేరాలు జరిగాయి. ఇండియా టుడే సర్వే ప్రకారం ఏపీలో 1,33,447 మంది వ్యభిచార కూపంలో చిక్కుకున్నారు. ఈ అమానుష సంఘటనలో రాష్ట్రం దేశంలోనే రెండో స్థానంలో ఉండడం అత్యంత బాధాకరం. జగన్మోహన్ రెడ్డి మాత్రం మహిళాభ్యుదయమే ధ్యేయంగా పనిచేస్తున్నామని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉంది.' అని రవికుమార్ అన్నారు.

ఎరక్కపోయి.. ఇరుక్కుపోయాడు

- ఆర్టీసీ బస్సు కిటికీలో ఉండిపోయిన ప్రయాణికుడి తల

టెక్కలి రూరల్, జనవరి 24: ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తుండగా ఓ ప్రయాణికుడి తల కిటికీలో ఇరుక్కుపోయింది. దీంతో తోటి ప్రయాణికులు అతికష్టం మీద అతని తలను బయటకు తీశారు. ఈ ఘటన టెక్కలిలో బుధవారం చోటుచేసుకుంది. టెక్కలి వచ్చేందుకు జగన్నాథపురం వద్ద గాడి సుందరరావు అనే వ్యక్తి పూండి-టెక్కలి పల్లె వెలుగు బస్సు ఎక్కాడు. బస్సు టెక్కలి సమీపంలోకి వచ్చే సమయం లో సుందరరావు బస్సు ఎమెర్జెన్సీ డోరు కిటికీలో నుంచి తన తల,ముఖం బయటకు పెట్టాడు. తిరిగి లోపలకు తీసేందుకు ప్రయత్నించినప్పటికీ రాలేదు. తల కిటికీలో ఇరుక్కు పోవడంతో గమనించిన డ్రైవర్ స్థానిక ఇందిరా గాంధీ కూడలి వద్ద బస్సును రోడ్డు పక్కకు ఆపాడు. దీంతో స్థానికులు, తోటి ప్రయాణికులు అతికష్టం మీద కిటికీలో ఇరుక్కున్న సుందరరావు తలను బయటకు తీయడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.



బస్సు కిటికీలో ఇరుక్కుపోయిన సుందరరావు తల

ఐటీడీఏ ఏర్పాటయ్యేనా?

- మెళియాపుట్టిలో కొత్తగా నెలకొల్పాలని గిరిజనుల ఆందోళనలు
- పట్టించుకోని ప్రభుత్వం
- సీతంపేటలోనే కొనసాగించాలని నిర్ణయం
- అక్కడకు వెళ్లేందుకు గిరిపుత్రుల ఇబ్బందులు



మెళియాపుట్టిలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలని ఆందోళన చేస్తున్న గిరిజనులు (ఫైల్)

మెళియాపుట్టి, జనవరి 24: జిల్లాకు ఐటీడీఏ లేకపోవడంతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాల పునర్విభ జనతో సీతంపేట ఐటీడీఏ పార్వతీపురం మన్యం జిల్లాకు వెళ్లిపోయింది. దీంతో జిల్లాలో కొత్తగా ఐటీడీఏ ఏర్పాటు చేస్తా మని వైసీపీ నాయకులు చెప్పారు. కానీ, ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు. మరో రెండు నెలల్లో ఎన్నికల నోటిఫికేషన్ రానున్నా నేపథ్యంలో కొత్త ఐటీడీఏ ఏర్పాటుపై సందేహం నెలకొంది. ప్రస్తుతానికి సీతంపేట ఐటీడీఏలోనే జిల్లా గిరిజనులను కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించడంపై ఆందోళన వ్యక్తమవుతుంది. ప్రస్తుతం సీతంపేట ఐటీడీఏ పరిధిలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన 16 మండలాలు, పార్వతీ పురం మన్యం జిల్లాకు చెందిన 4 మండలాలు ఉన్నాయి.

దూరం.. భారం..

సీతంపేటలో ఐటీడీఏ ఉండడంతో అక్కడకు వెళ్లేందుకు అవస్థలు పడుతున్నట్లు జిల్లా గిరిజనులు చెబుతున్నారు. సమస్యలను విన్నవించేందుకు సుమారు 100 కిలో మీటర్లు రవాణా చేయాల్సి వస్తుందని వాపోతున్నారు. మందస, ఇచ్ఛాపురం నుంచి వెళ్లాలంటే మూడు బస్సులు మారాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో బస్సు చార్జీలు అధికమవుతున్నాయని, అత్యవసరమైతే తప్పా సీతంపేట వెళ్లడం లేదని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాకు సంబంధించి మెళియాపుట్టి మండల కేంద్రంలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇక్కడ అధికంగా గిరిజనులు ఉన్నందున ఐటీడీఏ నెలకొల్పితే అందరికీ ఉపయోగకరంగా ఉంటుందని గిరిజన సంఘాలు అభిప్రాయపడుతున్నాయి. మరోపక్క మందస మండలంలో ఏర్పాటు చేయాలని మంత్రి అప్పలరాజు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నారు. పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డిశాంతి సైతం అసెంబ్లీలో ఐటీడీఏ కోసం ప్రస్తావించినా ఫలితం శూన్యం. ఎవరెన్ని చెప్పినా ప్రభుత్వం మాత్రం ప్రస్తుతానికి సీతంపేటలో కొనసాగించాలని నిర్ణయించింది. దీంతో రెండు నెలల పాటు గిరిజనులు ఆందోళనలు చేశారు. అయినా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో వచ్చే ఎన్నికల్లో ఓటు ద్వారా బుద్ధి చెప్పేందుకు గిరిజనులు సన్నద్ధమవుతున్నారు.

అధికారులు ఎక్కడ?

జిల్లా విభజనకు ముందు సీతంపేట ఐటీడీఏ అధికారులు గిరిజన మండలాల్లో తనిఖీలు నిర్వహించేవారు. గిరిజన ప్రాంతాల్లోని సచివాలయాలు, ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలను నిత్యం తనిఖీ చేసేవారు. అలాగే అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేశారు. దీనివల్ల కింది స్థాయి అధికారుల్లో భయం ఉండేది. అయితే సీతంపేట ఐటీడీఏ పార్వతీపురం జిల్లాలోకి వెళ్లిపోయినప్పటి నుంచి అధికారులు ఇటు వైపు కన్నెత్తి చూడడం లేదు. దీంతో గిరిజన ప్రజలకు మెరుగైన సేవలు అందడం లేదు. వసతి గృహాల్లో మెనూ అమలుకాకపోయినా పట్టించుకునే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా జిల్లాలో కొత్త ఐటీడీఏ ఏర్పాటు చేయాలని గిరిజనులు కోరుతున్నారు.



సీతంపేట ఐటీడీఏ కార్యాలయం

ఆర్థిక భారం భరించలేకపోతున్నారు..



సుదూర ప్రాంతంలో ఉన్న సీతంపేట ఐటీడీఏకు వెళ్లేందుకు జిల్లా గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్థిక భారం భరించలేక అక్కడకు వెళ్లలేకపోతున్నారు. మెళియాపుట్టిలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలని ఆందోళ చేసినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణం. ఇక్కడ ఏం జరుగుతుందో అధికారులకు తెలియడం లేదు. సీతంపేట ఐటీడీఏ ద్వారా నిధులు గాని, పథకాలు గాని గిరిజనుల దరి చేరడం లేదు.

-వాబ యోగి, రాష్ట్ర ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఉపాధ్యక్షుడు

టీడీపీ అధికారంలోకి వస్తే ఏర్పాటు చేస్తాం..



టీడీపీ మళ్లీ అధికారంలోకి వచ్చిన వెంటనే మెళియాపుట్టి మండల కేంద్రంలో ఐటీడీఏ ఏర్పాటు చేస్తాం. వైసీపీ ప్రభుత్వం గిరిజనులను మోసం చేసి ఓట్లు దండుకోవాలని ప్రయత్నం చేస్తుంది. ఈ ప్రభుత్వం గిరిజనులకు చేసిందేమీ లేదు. వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతాం.

-బైరిసింగి దినకరరావు, టీడీపీ గిరిజన సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి


పలాస: మాట్లాడుతున్న గౌతు శిరీష


నరసన్నపేట: మాట్లాడుతున్న బగ్గు రమణమూర్తి


హిరమండలం: మాట్లాడుతున్న వెంకటరమణ

ఆసరా పేరుతో టోకరా

● రాష్ట్రంలో విధ్వంస పాలన ● టీడీపీ నాయకుల ధ్వజం

ఆసరా పేరుతో నాలుగు విడతల్లో మహిళా సంఘాల రుణాలు రద్దుచేయించామని అంకెల గారడీ ప్రకటనలు చేస్తున్న సీఎం జగన్‌రెడ్డి మహిళలకు టోకరా పెట్టారని తెలుగుదేశం పార్టీ నాయకులు ధ్వజమెత్తారు. బుధవారం జిల్లాలో పలువురు టీడీపీ నాయకులు వేర్వేరు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో వైసీపీ హయాంలో విధ్వంసకరమైన పాలనతప్ప అభివృద్ధి ఎక్కడా కనిపించడంలేదని ధ్వజమెత్తారు.

కల్లబొల్లి కబుర్లు చెప్పి మోసం: కలమట

హిరమండలం: కల్లబొల్లి కబుర్లు చెప్పే జగన్‌మోహన్ రెడ్డి మహిళలకు నిట్టనిలువునా మోసం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ ఆరోపించారు. హిరమండలంలో విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం మహిళలకు ఆసరాపేరిట టోకరా పెడుతోందన్నారు. టీడీపీ హయాంలో డ్వాక్రా రుణమాఫీ, పసుపు-కుంకుమ ద్వారా కోటిమంది మహిళలు ఒక్కొక్కరు రూ.20 వేలు లబ్ధి పొందారని తెలిపారు. జగన్ రెడ్డి పాలనలో ఒక్కో మహిళ పొందిన లబ్ధి రూ.15వేలుకు తగ్గిపోయిందని, ఈ రకంగా 50 లక్షల మంది డ్వాక్రా మహిళలకు జగన్ టోకరా వేశారని ఆరోపించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పి.బుచ్చిబాబు, కె.సింహాచలం, బర్రి సురేష్, దారపు డిల్లేశ్వరరావు, గోళ్ల సింహాచలం పాల్గొన్నారు.

● టీడీపీతోనే బీసీలకు భవిష్యత్ ఉంటుందని పాతపట్నం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కలమట వెంకటరమణ తెలిపారు. హిరమండలంలో జయహో బీసీ సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా కలమట బీసీల సంక్షేమానికి ఎన్‌టీఆర్,చంద్రబాబునాయుడు చేసిన కృషిని వివరించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలమట సాగర్, జడ్పీటీసీ పి.బుచ్చిబాబు,సర్పంచ్‌లు లంక రోజారాణి, దారపు డిల్లేశ్వరరావు, బర్రి సురేష్, చింతాడ గిరి,ఎస్.గోవింద,గోళ్ళ సింహాచలం పాల్గొన్నారు.

కొందరికే రుణమాఫీ: బగ్గు

నరసన్నపేట: వైసీపీ నాయకులు కొందరి మహిళలకే ఆసరా పేరుతో రుణాలు మాఫీచేసి లక్షలాది మంది మహిళలకు అన్యాయం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆరోపించారు. నరసన్నపేటలో విలేకరులతో మాట్లాడుతూ మహిళ పక్షపాతిగా పేరుగాంచిన చంద్రబాబు డ్వాక్రాసంఘాలను ఏర్పాటుచేశారన్నారు. జగన్‌రెడ్డి పాలనలో మహిళలకు రక్షణ లేకుండాపోయిందని ఎందరో మహిళలు అత్యాచారానికి గురవుతున్నారని గణాంకాలు చెబుతున్నాయన్నారు.రాష్ట్రంలో కోటి 14 లక్షలు మంది డ్వాక్రా మహిళలుంటే కేవలం 79 లక్షల మందికే ఆసరా అందించి మిగతా 35 లక్షలు మందికి ఈపథకం వర్తింపచేయకుండా మోసం చేసారన్నారు.కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు శిమ్మ చంద్రశేఖర్, పార్టీ పట్టణాధ్యక్షులు కింజరాపు రామారావు, చిట్టిబాబు, భైరి భాస్కరరావు, రాజేంద్ర, ఎంపీ నాయుడు, లుకలాపు రాంబాబు, బగ్గు గోవింద పాల్గొన్నారు.

పలాస అభివృద్ధి ఎక్కడ : శిరీష

పలాస: పలాస నియోజకవర్గంలో మంత్రి అప్పలరాజు చేసిన అభివృద్ధి ఎక్కడా కనిపించడం లేదని, తమ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధే చూపిస్తున్నారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష ఆరోపించారు. పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలోని 20వ వార్డు లేబర్‌కాలనీలో వార్డు వార్డుకు టీడీపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పలాసలో విధ్వంశకర పాలనతప్ప అభివృద్ధి లేదని, కొండలు అమ్ముకోవడం తప్ప వారిమార్కు ఎక్కడా కనిపించడంలేదని ఆరోపించారు. మహిళ అని చూడకుండా తనను చేసిన అవమానాన్ని ప్రజలు గుర్తించారని, తమ నాయకులు, కార్యకర్తలే టార్గెట్‌గా మంత్రి దాడులు చేయిస్తున్నారని విమర్శించారు.టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు మాట్లాడుతూ మునిసిపాలిటీలో మంత్రి అప్పలరాజు తన సొంతనిదులు ఒక్క రూపాయి అయినా ఖర్చు చేశారా అని ప్రశ్నించారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడు బడ్డ నాగరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కార్యక్రమంలో బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి లొడగల కామేశ్వరరావుయాదవ్, కార్యనిర్వాహక జిల్లా కార్యదర్శి గాలి కృష్ణారావు, వాణిజ్యవిభాగం జిల్లా అధ్యక్షుడు టంకాల రవిశంకర్‌గుప్తా, మల్లా శ్రీనివాస్, శాసనపురి మురళీకృష్ణ, అంబటి కృష్ణమూర్తి, డడియాల నర్సింహులు, యవ్వారి మోహనరావు, ఉమాకాంత్ పాల్గొన్నారు.

భోజనాలు సరిపోక క్రీడాకారుల అవస్థలు


టెక్కలి జూనియర్ కళాశాల మైదానంలో భోజనాలకోసం నిరీక్షిస్తున్న క్రీడాకారులు

టెక్కలి రూరల్: టెక్కలి జూనియర్ కళాశాల మైదానంలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీల్లో బుధవారం గందరగోళం నెలకొంది. క్రీడాకారులకు మధ్యాహ్న సమయంలో భోజనాలు సరిపోకపోవడంతో ఇబ్బందులుపడ్డారు. క్రీడాకారులకు అధికారులు టోకెన్లు జారీచేసి భోజనాలు ఏర్పాటుచేశారు. అయితే పూర్తిస్థాయిలో భోజనాలు సరిపోకడంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. కాగా క్రీడాకారులకు సరిపడా భోజనాలు కంటే అధికంగానే పంపించామని టెక్కలి తహసీల్దార్ ప్రవళ్లిక ప్రియ తెలిపారు. కొంత మంది బయట వ్యక్తులు కూడా భోజనాలకు రావడంతో సుమారు నలుగురు క్రీడాకారులకు భోజనం సరిపోలేదని చెప్పారు. వారికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో భోజనాలు ఏర్పాటు చేశామని తెలిపారు.

యోగా శిక్షకుల సర్టిఫికెట్ల పరిశీలన

పలాస రూరల్: బ్రాహ్మణతర్లా హోమియో వైద్యశాల పరిధిలో గల హెల్త్‌అండ్ వెల్‌నెస్ సెంటర్‌లో పార్ట్‌టైమ్ యోగాశిక్షకులకు బుధవారం నిర్వహించిన ఇంటర్వ్యూలకు ముగ్గురు హాజరయ్యారని వైద్యులు దుర్గాప్రసాద్ పట్నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా వారి పీజీ,డిగ్రీతోపాటు ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్లను పరిశీలించామని,వాటి వివరాలను విజయవాడలోని ఆయూష్ కమిషనర్‌కు పంపించినట్లు చెప్పారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యురాలు అంజలి, ఫార్మాసిస్టు జోసెఫ్, హెచ్‌ఎం వెంకటరమణ పాల్గొన్నారు.

1,352 గ్రామాల్లో రీసర్వే

● సర్వే విభాగం ఉపసంచాలకుడు కొండలరావు


రికార్డులు పరిశీలిస్తున్న కొండలరావు

ఎల్.ఎన్.పేట: జిల్లాలో ఇప్పటివరకు 1,352 రెవెన్యూ గ్రామాల్లో డ్రోన్‌తో రీసర్వే పూర్తిచేసినట్లు సర్వే విభాగం జిల్లా ఉపసంచాలకుడు బి.కొండలరావు తెలిపారు. బుధవారం ఎల్.ఎన్.పేట తహసీల్దార్ కార్యాలయంలో సర్వే రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 1,465 రెవెన్యూ గ్రామాలకు గాను ఇప్పటివరకు 1,352 రెవెన్యూ గ్రామాల్లో 6.21 లక్షల ఎకరాల్లో డ్రోన్ ద్వారా సర్వేపూర్తిచేసినట్లు తెలిపారు. వీటిలో 1100 రెవెన్యూ గ్రామాలకు సంబంధించిన సర్వేమ్యాపులు వచ్చాయని చెప్పారు. 72 రెవెన్యూ గ్రామాల్లో నెట్‌సిగ్నల్ లేకపోవడంతో ప్రత్యామ్నాయ పద్ధతుల్లో సర్వేను పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సర్వే పూర్తయిన 727 రెవెన్యూ గ్రామాల్లో నోటిఫికేషన్ పూర్తి చేశామన్నారు. జిల్లాలోని మునిసిపాల్టీలు, కార్పొరేషన్ల పరిధిలో 55 రెవెన్యూ గ్రామాలు విలీనమయ్యాయని చెప్పారు. వీటి పరిధిలో 19 రెవెన్యూ గ్రామాల్లో డ్రోన్‌సర్వే పూర్తిచేశామన్నారు. వంశధార రిజర్వాయర్ నిర్మాణంలో నాలుగు, కొవ్వాడ అణువిద్యుత్ ప్లాంటేషన్ నిర్మాణంలో రెండు గ్రామాలు కలిసిపోయాయని చెప్పారు. కార్యక్రమంలో టెక్కలిడివిజన్ సర్వే జిల్లా ఉపరిశీలకుడు మామిడి జనార్దనరావు, మండల సర్వేయరు రెడ్డి గవరయ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి


నందిగాంలో నిరసన తెలుపుతున్న బీటీఏ ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు

నందిగాం: అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని బహుజన్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నందిగాం ఎంఆర్‌సీ ఎదుట బుధవారం నిరసన తెలిపారు. ఎంఈవో జి.నర్సింహులకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. బీటీఏ నిరసనకు పీఆర్‌టీయూ రాష్ట్ర గౌరవాధ్యక్షులు జె.బాబూరావు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బంగారు తాతారావు , మండలశాఖ అధ్యక్షులు రట్టి లక్ష్మీనారాయణ, కార్యవర్గ సభ్యులు బోకర ప్రకాశరావు, గోపి, పి.దుర్యోధన, అమీన్, వైకుంఠరావు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

పోలాకి: పోలాకి ప్రభుత్వోన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పని తీరును బుధవారం రాష్ట్ర కమిటీ సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా వంట నిర్వాహకులు, హెచ్‌ఎం రాజపంతుల లక్ష్మిలతో మాట్లాడారు.రాష్ట్ర కమిటీసభ్యులు పి.సూర్య, ఎస్.విద్యాసాగర్ రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈఓ లింగరాజు, విద్యాకమిటీ చైర్మన్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోలాకిలో పూరిల్లు దగ్ధం

పోలాకి: పోలాకి బీసీకాలనీ సమీపంలోని చెత్త నుంచి సంపద తయారుచేసే కేంద్రం వద్ద మంగళవారం రాత్రి అగ్నిప్రమాదం సంబవించింది. దీంతో దానికి ఆనుకుని ఉన్న పూరిల్లు దగ్ధంకావడంతో రూ15వేల ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు తహసీల్దార్ కార్యాలయఅధికారులకుఫిర్యాదుచేశాడు. రాత్రిఆకస్మికంగా మంటలు చెలరేగడంతో నరసన్నపేట అగ్నిమాపక శకటంమంటలను అదుపుచేసింది. ఆస్తి నష్టం వివరాలను అంచనావేయడానికి సంఘటనాస్థలాన్ని పరిశీలించాలని బాధితుడు శ్యామలరావు అధికారులకు కోరారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం శిథిలావస్థకు చేరుకుందని, గడ్డితోనిర్మించిన కేంద్రం కావడంతో అగ్నిప్రమాదానికి గురైందని బాధితులు తెలిపారు.

పదో తరగతి విద్యార్థులపై దృష్టి సారించాలి

టెక్కలి: పదో తరగతి పరీక్షల టైమ్‌టేబుల్ వెలువడడంతో మెరుగైన ఫలితాలు కోసం ప్రణాళికలు రూపొందించుకోవాలని, ఆ దిశగావిద్యార్థులపై దృష్టి సారించాలని ఉపవిద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ తెలిపారు. బుధవారం టెక్కలిలో డివిజన్‌స్థాయి హెచ్‌ఎంల సమావేశంలో మాట్లాడుతూ ఆన్‌లైన్ టెస్ట్‌లపై శ్రద్ధ చూపాలన్నారు. ఈ సందర్భం గా ఈఎండీపీ పుస్తకాన్నిఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి ఎన్.కుమారస్వామి, జిల్లా పరీక్షల విభాగం కార్యదర్శి జి.రాజేంద్రప్రసాద్, విద్యాశాఖ ప్రతినిధి శరత్, రామకృష్ణారావు, చిలుకు కృష్ణారావు, హరిబాబు, కుప్పిలి నగేష్, ప్రకాష్ పాల్గొన్నారు.

● నరసన్నపేట: ప్రభుత్వ పాఠశాలల నిర్వహణపై పర్యవేక్షణాధికారులు దృష్టి సారించాలని డిప్యూటీ డీఈవో పగడాలమ్మ సూచించారు. స్థానిక ఎమ్మార్సీ భవనం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలలు యూడైస్ వివరాలను ఆన్‌లైన్ సకాలంలో సబ్మిట్ చేయాలని, పాఠశాలల, విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచేలా మార్గదర్శకాలను ఎంఈవోలు ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో తేజ, ఎండీఎం ఇన్‌చార్జి శరత్, శాంతారావు, పేడాడ దాలినాయుడు పాల్గొన్నారు.

108 అంబులెన్స్ సిబ్బందికి శిక్షణ

పలాస: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో 108 అంబులెన్స్ సర్వీసులో పనిచేస్తున్న మెడికల్ టెక్నీషియన్లకు జిల్లా ఏఈఎంఎస్ మేనేజర్ హరిప్రసాద్, ఓఈ జగన్నాధరావు, నెయ్యిల కృష్ణ శిక్షణతరగతులు బుధవారం నిర్వహిం చారు. ప్రసూతి వైద్యం, శిశువు జన్మించిన తరువాత తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కార్యక్రమంలో పలాస, టెక్కలి, శ్రీకాకుళం డివిజన్లకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీకి బుద్ధిచెప్పాలి

జలుమూరు: వైసీపీ పాలనలో నాయీ బ్రాహ్మణులకు అన్ని విధాల అన్యాయం జరిగిందని, వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని జిల్లా నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు కుప్పిలి వెంకటరావు తెలిపారు.బుధవారం చల్లవానిపేట కూడలిలో సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీ హయాంలో నాయీ బ్రాహ్మణులకు ఆదరణ పథకం అమలుచేసి ఆదుకున్నట్లు తెలిపారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నాయీబ్రాహ్మణులకు అందించే పథకాలన్నీ రద్దుచేసి మోసం చేసిందని ఆరోపించారు.ఆలయాల్లో పనిచేసిన వారికి పర్మినెంట్‌చేస్తామని, కేశఖండన చేసిన వారికి రెగ్యులర్ చేస్తామని పాదయాత్రలో ఇచ్చి నహామీలను జగన్ విస్మరించారని విమర్శించారు. సమావేశంలో సంఘంనాయకులు నాగరాజు,భాస్కరరావు, ఈశ్వరరావు, చిన్నారావు, గంగులు, ఎర్రయ్య పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

వజ్రపుకొత్తూరు: నగరంపల్లిలో కింతలి గోపాలరావు, రెయ్యిపాడులో జోగ తులసమ్మ, దేవునల్తాడలో తులే అప్పారావు ఇటీవల మృతి చెందడంతో ఆయా కుటుంబాలకు టీడీపీ రాష్ట్రప్రధానకార్యదర్శి గౌతుశిరీష బుధవారం పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు సూరాడ మోహనరావు, అర్సవెల్లి ఉమామహేశ్వరరావు, దువ్వాడ జయరాం చౌదరి, సనపల చక్రవర్తి, దువ్వా అప్పారావు, సైన బాలజీ, కోనారి మల్లేసు, గోవిందుపాపారావు, తులే అప్పాజీ, మెట్టరమణ,తిర్రి నారాయణస్వామి పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు..

జలుమూరు: రామకృష్ణాపురంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాద బాధితులను ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాసు బుధవారం పరామర్శించారు. అనంతరం కొమనాపల్లి వద్ద నిర్మించిన రహదారిని ప్రారంభించారు. కార్యక్రమంలో రెవెన్యూ పరిశీలకులు సతీష్, పోలాకి జడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య, ఎంపీపీ వాన గోపి, మండల ఉపాధ్యక్షుడు తంగి మురళీకృష్ణ పాల్గొన్నారు.


నేడు విశ్రాంత ఉద్యోగుల ధర్నా

టెక్కలి:అపరిష్కృత సమస్యలు పరిష్కరించాలని గురువారం తాలుకా కేంద్రాల్లో ధర్నా నిర్వహించనున్నట్లు విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షులు రోణంకి రామచంద్రరావు తెలిపారు. గురువారం టెక్కలిలో విలేకరులతో మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న డీఆర్ బకాయిలు వెంటనే చెల్లించాలని, 11వ పీఆర్సీన ఎరియర్స్ వెంటనే చెల్లించాలని, హెల్త్‌కార్డులు ద్వారా అన్ని వ్యాధులకు అన్ని గుర్తింపు పొందిన ఆసుపత్రుల్లో వైద్యం అందించాలని కోరారు. ఈనెల 29న జిల్లా కేంద్రాల్లో, ఫిబ్రవరి 5న రాష్ట్రస్థాయిలో కూడా ధర్నా నిర్వహిస్తామని తెలిపారు.

రేపు ఆహ్వానిత కబడ్డీ పోటీలు

పలాస రూరల్: మండలంలోని రంగోయి గ్రామానికి చెందిన అభ్యుదయ యువజన సంఘం 30వ వార్షికోత్సవం పురస్కరించుకుని శుక్రవారం జిల్లా స్థాయి ఆహ్వానిత కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు అభ్యుదయ సంఘం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఆసక్తి గల క్రీడాకారులు గురువారంలోగా 9381527239, 8074478590 నెంబర్లకు వివరాలను అందజేయాలని కోరారు.

రేపు రైతు రక్షణ ర్యాలీ


మాట్లాడుతున్న గణపతి

కాశీబుగ్గ: రైతు రక్షణ ర్యాలీని ఆలిండియా సంయుక్త కిసాన్ మోర్చా, ఆల్‌ట్రేడ్ యూనియన్ల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహిస్తున్నామని రైతు,కార్మిక,ప్రజా సంఘాల నాయకులు తెలిపారు.బుధవారం కాశీబుగ్గలో సీపీఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రైతు వ్యతిరేక నల్లచట్టాలు రద్దుచేస్తున్నామని పార్లమెంట్‌లో మోదీ ప్రకటించి రెండేళ్ల గడుస్తున్నా రద్దుచేయలేదని ఆరోపించారు. రైతులపై ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిరసనగా దేశవ్యాప్తంగా రిపబ్లిక్‌డేరోజున నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గణపతి, సీహెచ్ వేణుగోపాల్, సన్యాసి రావు, మాధవరావు, రామారావు,శ్రీనివాస్,రవి,వాసు పాల్గొన్నారు.

రేపు శోభాయాత్ర బైక్‌ర్యాలీ

కోటబొమ్మాళి: అయోధ్యలో రామ మందిరం ప్రతిష్ఠ దిగ్విజయంగా జరగడంతో శుక్రవారం కొత్తపేట శివకేశవ ఆలయం నుంచి రామశోభాయాత్ర బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు రామభక్తులు ఒకప్రకటనలో తెలిపారు. కొత్తమ్మతల్లి ఆలయం, ఊడికలపాడు, యలమంచిలి, హరిశ్చంద్రపురం, యంకన్నపేటరామమందిరాలు, గుంజిలోవ వేంకటేశ్వరాలయం, పాకివలస ఆంజనేయాలయం వరకు ర్యాలీ జరుగుతుందని పేర్కొన్నారు.


పాతపట్నం: పాఠశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు సత్కరించిన ఉపాధ్యాయులు


హిరమండలం: కేజీబీవీ బాలికలు నేషనల్ చైల్డ్‌డే ముగ్గు వేసిన దృశ్యం



ఇచ్ఛాపురం రూరల్: భవానీపురం అంగన్‌వాడీ కేంద్రంలో..

బాలికలు అన్నిరంగాల్లో ముందుండాలి

●పాఠశాలల్లో జాతీయ బాలికా దినోత్సవం

బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలని వక్తలు పిలుపునిచ్చారు. బుధవారం జాతీయ బాలిక దినోత్సవాన్ని పాఠశాలలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా బాలికలకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. బాల్య వివాహాలను నియంత్రించాలని విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. -ఆంధ్రజ్యోతి బృందం


నందిగాంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు

నకిలీ బెంతుఒరియాలను ఎస్టీలో చేర్చవద్దు

●జంట పట్టణాల్లో గిరిజన సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజన సంఘాల నాయకులు

పలాస/కాశీబుగ్గ/పలాస రూరల్: నకిలీ బెంతు ఒరియాలను ఎస్టీ జాబితాలో చేర్చవద్దనిఆదివాసీగిరిజనసంఘాల ఆధ్వర్యంలో పలాస-కాశీబుగ్గ జంటపట్టణాల్లో బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘ నాయకులు సవర జగన్నాయకులు, సవర రాంబాబు విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో బెంతు ఒరియాలు లేరన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జీవో- 52 ద్వారా బోయివాల్మీకి, ఇతర కులాలను ఎస్టీలో చేర్చించడానికి చేసిన క్యాబినెట్ తీర్మానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వైసీపీప్రభుత్వం గిరిజనులకు అన్యాయం చేసిందని ఆరోపించారు.తొలుత మంత్రి అప్పలరాజు,టీడీపీ రాష్ట్రప్రధానకార్యదర్శి గౌతు శిరీషను కలిసి తమసమస్యలు విన్నవించారు. అనంతరం ఆర్డీవో భరత్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జేఏసీ ప్రధాన కార్యదర్శి జి.అప్పన్న, పి.ఈశ్వరరావు, వి.కృష్ణారావు, జగన్, గణేష్, లోకేశ్వరరావు, రామారావు, సిద్ధు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

నరసన్నపేట: క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయని ఎంపీడీవో బి.మధుసూదనరావు, తహసీల్దార్ సింహాచలం తెలిపారు. బుధవారం స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో నియోజవర్గస్థాయి ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను నిర్వహించారు.కార్యక్రమంలో ఎంపీపీ ఆరంగి మురళి, చింతు రామరావు, ఈవో చిన్నారావు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే తీరప్రాంత అభివృద్ధి


మాట్లాడుతున్న భీమారావు

సంతబొమ్మాళి: టీడీపీ ప్రభుత్వ హయంలోనే తీరప్రాంత గ్రామాలు అభివృద్ధి చెందాయని టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు జీరు భీమారావు,రెడ్డి అప్పన్న తెలిపారు.బుధవారం ఉమిలాడ, ఎస్‌బి కొత్తూరు తీరప్రాంత పంచాయతీల్లో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మత్స్యకార గ్రామాల్లో వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ అట్టాడ రాంప్రసాద్, వారాధి చంటి,పంగ అశిరినాయుడు,సువ్వారి ప్రసాదరావు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై వైసీపీ ప్రచారం తగదు

పలాస: రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలన్నీ తమ పథకాలుగా వైసీపీ నాయకులు ప్రచారం చేయడం తగదని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొర్రాయి బాలకృష్ణయాదవ్ తెలిపారు. బుధవారం స్థానిక హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ వద్ద ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు.

పదో తేదీలోగా జీతాలు జమచేయాలి

టెక్కలి: ఆర్టీసీ డిపో గ్యారేజ్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వి.తులసీరామ్ కోరారు. బుధవారం టెక్కలిలో ఆర్టీసీ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్మికులకు ఇచ్చే సర్క్యులర్ ప్రకారం ప్రతినెలా పదో తేదీలోగా వారి జీతాలు ఖాతాల్లో జమచేయాలని, ప్రతి ఆరు నెలలకు పెరిగే డీఏ బకాయిలు ఏరియర్స్ రూపంలో కార్మికులకు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో చిన్నప్పడు, రాములు, నంబూరు షణ్ముఖరావులు ఉన్నారు.

ఆక్రమణలపై అధికారుల దృష్టికి తీసుకువెళ్తాం


ఆక్రమించిన స్థలాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

పలాస: భూఆక్రమణల వ్యవహారాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్తామని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష తెలిపారు.పలాస-కాశీబుగ్గలోని శివాజీనగర్ పారిశ్రామికవాడ రోడ్డులో ఉమారామలింగేశ్వరాలయం వద్ద వైసీపీ నాయకులు ఆక్రమిస్తున్న స్థలాన్ని టీడీపీ నాయకులు బుధవారం పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వజ్జ బాబూరావు, నాగరాజు, సురేష్‌కుమార్, ఉప్పాడ పాండురంగారావు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

● గల్లి- బెండి గ్రామాల మధ్య రోడ్డుపై రంధ్రం


గల్లి- బెండి ఆర్‌అండ్‌బీ రోడ్డులో రంధ్రం వద్ద జెండా పాతిన దృశ్యం

వజ్రపుకొత్తూరు: గల్లి-బెండి గ్రామానికి మధ్యలో ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డుపై ప్రమాదం పొంచిఉంది.ఇక్కడ రోడ్డుపై రంధ్రం ఏర్పడడంతో ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. స్థానికులు ప్రమాదాలు జరకుండా రోడ్డుపైఉన్న రంధ్రం వద్ద జెండాను పాతి వాహనచోదకులను అప్రమత్తంచేశారు. ప్రమాదాలు జరగకముందే అధికారులు రంధ్రం పూడ్చాలని పలువురు కోరుతున్నారు.

బాలికపై తాత పైశాచికత్వం

● కడుపునొప్పి రావడంతో బయటపడిన వైనం

కోటబొమ్మాళి, జనవరి 24: కోటబొమ్మాళి మండలంలోని ఓ గ్రామానికి చెందిన 70 ఏళ్ల వృద్ధుడు తన మనవరాలిపై పైశాచికత్వానికి పాల్పడ్డాడు. ఈమేరకు బుధవారం బాధితురాలు తల్లి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసుల వివరాల మేరకు.. ఆ గ్రామంలో బాధితురాలి తండ్రి కిరాణా వ్యాపారం చేస్తున్నాడు. తండ్రి, కుమారుడు వేర్వేరుగా ఉంటున్నారు. అప్పుడప్పుడు కుమారుడు తన భార్య, కూతురుతో కలిసి తండ్రి ఇంటికి వెళ్లివస్తుంటాడు. ఈనెల 19న మధ్యాహ్నం తన ఎనిమిదేళ్ల కూతురును తండ్రి ఇంటికి వచ్చి విడిచిపెట్టి పోయాడు. మళ్లీ సాయంత్రం కుమారుడు వచ్చి కూతురును తీసుకువెళ్లిపోయాడు. 20వ తేదీ ఉదయం తల్లి తన కుమార్తెకు స్నానం చేద్దామని బట్టలు తీసేసరికి రక్తపు మరకలు కనిపించాయి. తల్లి ప్రశ్నించగా తన తాత తనపై చేసిన అఘాయిత్యం గురించి చెప్పింది. పక్కనే ఉన్న నానమ్మ ఏడ్చావంటే చురకలు పెడతానంటూ తనను బెదిరించిందని, తాత తన నోరు మూసేసి అఘాయిత్యం చేశాడని బాలిక తల్లికి వివరించింది. ఈ విషయం బయటకు తెలిస్తే పరువు పోతుందని బాలిక తల్లిద్రండులు ఎవ్వరికి చెప్పకుండా షాపులో మందులు తీసుకుని వేశారు. మంగళవారం బాలిక పాఠశాలకు వెళ్లింది. కడుపులో తీవ్రమైన నొప్పిరావడంతో ఉపాధ్యాయులు ఫోన్‌చేసి చెప్పడంతో బాలిక తండ్రి వెళ్లాడు. షాపులో మందులు కొనుగోలుచేసి వేశాడు. మళ్లీ బుధవారం బాలికకు కడుపునొప్పి ఎక్కువ కావడంతో టెక్కలి జిల్లా ఆసుపత్రికి తల్లిదండ్రులు చేర్చారు. బాధితురాలి తల్లి ఫిర్యాదు చేయడంతో స్థానిక ఎస్‌ఐ షేక్ మహ్మద్ అలీ కేసు నమోదు చేశారు. టెక్కలి డీఎస్పీ బాలచంద్రదారెడ్డి, సీఐ సూర్యచంద్రమౌళి ఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీతోనే అభివృద్ధి

● ఎమ్మెల్యే బెందాళం అశోక్

ఇచ్ఛాపురం రూరల్: తెలుగుదేశం పార్టీతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. బుధవారం తిప్పనపుట్టుగ గ్రామంలో ఎంపీ నిధులు రూ.5 లక్షలతో నిర్మించిన రెడ్డి సామాజిక సంఘ భవనాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వైసీపీ నాలుగేళ్ల పాలనలో అభివృద్ధి శూన్యమన్నారు. అనంతరం ఆ గ్రామంలో చివరి వీధిలో ఎంపీ నిధులు రూ.5 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రాష్ట్ర బీసీ సాధికార కమిటీ కన్వీనర్ కొండా శంకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ దక్కత ఢిల్లీరావు, మాజీ ఏఎంసీ ఛైర్మన్ సహదేవు రెడ్డి, దక్కత కామేశ్వరరావు, బోర ప్రసాద్ తదితనేలే పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం రూరల్: రెడ్డి సామాజిక సంఘ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అశోక్

ఇంకెన్నాళ్లు మోసం చేస్తావు జగన్

● మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి

అరసవల్లి: ఆసరా పేరిట నాలుగు విడతల్లో డ్వాక్రా సంఘాల రుణాలు రద్దు చేశామని చెబుతున్న జగన్‌రెడ్డి తన మోసపూరిత మాటలతో ఇంకెన్నాళ్లు మోసం చేయగలడని టీడీపీ మాజీ ఎమ్మెల్యే, శ్రీకాకుళం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గుండ లక్ష్మీదేవి ప్రశ్నించారు. బుధవారం ఆమె తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ.. 57 నెలల వైసీపీ పాలనలో రాష్ట్రంలో మహిళలపై దాడులు, దౌర్జన్యాలు మితిమీరిపోయాయని, కల్తీ మద్యంతో వేలమంది మహిళల మంగళసూత్రాలను తెంచేసిన ఘనత జగన్‌కే దక్కుతుందని విమర్శించారు. రాష్ట్రంలో 1.14 కోట్ల మంది డ్వాక్రా మహిళలుంటే 79 లక్షల మందికే ఆసరా అందించి చేతులు దులుపుకున్నాడని అన్నారు. అన్ని విధాలుగా రాష్ట్రంలో మహిళల పరిస్థితి దిగజారి పోయిందని, అయినా సరే నా అక్క చెల్లెల్లు అంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు ఎందుకని నిలదీశారు.

బాబుతోనే రాష్ట్ర భవిష్యత్

జి.సిగడాం: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్ సాధ్యమని క్లస్టర్ ఇన్‌చార్జి టంకాల మౌళీశ్వరరావు అన్నారు. బుధవారం అనందపురంలో బా బుష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి టీడీపీ మినీ మ్యానిఫెస్టోని ప్రజలకు వివరించారు. టీడీపీ నాయకులు పైల రామకృష్ణంనాయుడు, చిత్తిరి అసిరినాయుడు, చిత్తిరి లక్షుం తదితరులు పాల్గొన్నారు.



టీడీపీ మేనిఫెస్టో వివరిస్తున్న నాయకులు



గార: పిలకపేటలో బాబు ష్యూరిటీ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి

నగరంలో ఇంటింటికీ టీడీపీ



టీడీపీ మేనిఫెస్టో వివరిస్తున్న గొండు శంకర్

అరసవల్లి: వైసీపీ ప్రభుత్వంలో పేద, మధ్య, బడుగు, బలహీన వర్గాల ప్రజలు పడుతున్న కష్టాలు, వారి సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గొండు శంకర్ బుధవారం నగరంలోని ఏడో వార్డు రెళ్లవీధిలో ఇంటింటికీ టీడీపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతీ ఇంటికీ వెళ్లి తెలుగుదేశం పార్టీ సంక్షేమ పథకాలు, టీడీపీ అధికారంలోకి వస్తే ప్రజలకు జరిగే మేలు నేరుగా వివరించారు. రాష్ట్రంలో పరిస్థితి చక్కబడాలంటే చంద్రబాబు వంటి దూరదృష్టి, సమర్థత గల నాయకుడి పరిపాలన అవసరమని, ఆయనను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. కార్యక్రమంలో ఇంటి శంకర్, ఇంటి బాలకృష్ణ, అరుగుల రాము, జలగడుగుల తిరుమలరావు, రాజేష్, అరుగుల భాస్కర్, మాజీ కౌన్సిలర్ అంబటి లక్ష్మీరాజ్యం, పాండ్రంకి శంకర్, బొల్లా నాగేంద్ర యాదవ్, ఇప్పిలి తిరుమలరావు, రెడ్డి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

నగర టీడీపీ కార్యక్రమాల్లో వివాదం

శ్రీకాకుళం, జనవరి 24(ఆంధ్రజ్యోతి): నగరంలో తెలుగుదేశం పార్టీ కార్యక్రమాల్లో ఆ పార్టీకి చెందినవారి మధ్య వివాదం నెలకొంది. జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గొండు శంకర్ మంగళవారం టీడీపీ తరఫున నగరంలో ఓ వార్డులో తన మద్దతుదారులతో మినీ మేనిఫెస్టో అంశాలను వివరిస్తూ పర్యటించారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ నగర అధ్యక్షుడు మాదారపు వెంకటేష్ తన అనుచరులతో అక్కడకు చేరుకున్నారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవికి సమాచారం ఇవ్వకుండా, ఇటు పార్టీ నగర అధ్యక్షుడినైన నాకు చెప్పకుండా.. డివిజన్ ఇన్‌చార్జీలకు చెప్పకుండా వ్యక్తిగతంగా పార్టీ కార్యక్రమాలను ఎలా నిర్వహిస్తావంటూ గొండు శంకర్‌ను ప్రశ్నించారు. దీంతో గొండు శంకర్ అక్కడి నుంచి ఏమీ అనకుండానే వెళ్లిపోయారు. ఆ తర్వాత సాయంత్రం మరో వార్డులో పార్టీ తరఫున ప్రచారం చేపట్టారు.

29లోగా వసతులు కల్పించాలి

కలెక్టరేట్: వచ్చే సాధారణ ఎన్నికల కోసం పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని, అన్ని ఏర్పాట్లు ఈ నెల 29వ తేదీలోగా పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ఈఆర్వో, ఏఈఆర్వో శాఖల అధికారులతో కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, డీఆర్వో ఎం.గణపతిరావు, డిప్యూటీ కలెక్టర్ జయదేవి, పద్మావతి, వివిధ శాఖల అధికారులు జయప్రకాష్, బి.శాంతిశ్రీ, కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సప్లిమెంటరీ జాబితాలోకి కొత్త దరఖాస్తులు

కలెక్టరేట్: ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు ఇతర సవరణల కోసం గడిచిన 41 రోజుల్లో 21,242 దరఖాస్తులు అందాయని, తాజాగా వచ్చిన వాటిని పరిశీలించి సప్లిమెంటరీ జాబితాలో చేరుస్తామని డీఆర్వో ఎం.గణపతిరావు అన్నారు. బుధవారం తన కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన 30వ వారపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక ఓటర్ల సవరణ జాబితాలో ఏమైనా అభ్యంతరాలుంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. సమావేశంలో కొమ్మనాపల్లి వెంకటరామరాజు (టీడీపీ), ఎస్.సత్యనారాయణ (వైసీపీ), డి.మల్లిబాబు (కాంగ్రెస్), సోమేశ్వరరావు, ఎ.కృష్ణారావు (బీఎస్పీ), సురేష్‌సింగ్ బాబు (బీజేపీ) తదితరులు పాల్గొన్నారు.

నేడు వైసీపీ జిల్లా స్థాయి సమావేశం

శ్రీకాకుళం క్రైం: విశాఖ జిల్లా భీమిలి నుంచి ఈ నెల 27న ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుడుతున్న నేపథ్యంలో గురువారం శ్రీకాకుళం జిల్లా పార్టీ కార్యాలయంలో వైసీపీ జిల్లా స్థాయి సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ బుధవారం ఓ ప్రకటలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి వైసీపీ ఉత్తరాంధ్ర పార్టీ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి హాజరై పార్టీ శ్రేణులకు విలువైన సమాచారం అందిస్తారన్నారు. ఈ సమావేశానికి జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు హాజరు కావాలన్నారు.

సీఎం సభను విజయవంతం చేయాలి

ఆమదాలవలస: ఈ నెల 27న జరగనున్న సీఎం జగన్ సభను విజయవంతం చేయాలని స్పీకర్ తమ్మినేని సీతారాం పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక మార్కెట్ కమిటీ యార్డులో నియోజకవర్గ వైసీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సీతారాం మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని నాలుగు మండలాలు మున్సిపాలిటీ నుంచి జన సమీకరణ చేపట్టాలన్నారు. ఎమ్మెల్సీ రఘురాజు, సరుబుజ్జిలి ఎంపీపీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. కాగా ఈ సమావేశానికి ఆమదాలవలస జడ్పీటీసీ బెండి గోవిందరావు, ఎంపీపీ తమ్మినేని శారద తనయుడు శ్రీరామ్మూర్తి హాజరుకాకపోవడంపై గుసగుసలు వినిపిస్తున్నాయి.

మహిళల పేరుతోనే పథకాలు

గార/శ్రీకాకుళం క్రైం: సంక్షేమ పథకాలు మహిళల పేరుతోనే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని, మహిళలను ఇంటికి లీడర్లుగా తయారు చేస్తున్నట్టు మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. బుధవారం సాయంత్రం అంపోలులో ఆసరా చెక్కులు పంపిణీలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎంపీపీ గొండు రఘురామ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు అధికారులు పాల్గొన్నారు. శ్రీకాకుళం రూరల్ మండలం పొన్నాం గ్రామంలో పర్యటించి ఆసరా చెక్కులు పంపిణీ చేశారు.

● జి.సిగడాం: ఆసరా పథకం మహిళలకు వరంలాంటిదని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆసరా నాలుగో విడత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీపీ మీసాల సత్యవతి, జడ్పీటీసీ కాయల రమణ తదితరులు పాల్గొన్నారు.

ఖేలో ఇండియా అంపైర్‌గా సూరిబాబు

శ్రీకాకుళం స్పోర్ట్స్: తమిళనాడు రాష్ట్రంలో జరగనున్న ఖేలో ఇండియా బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో అంపైర్‌గా చిలకపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సంపతిరావు సూరిబాబును నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ టోర్నమెంట్ ఈ నెల 25 నుంచి 31వ తేదీ వరకు జరుగుతోంది. వీరి నియామకంపై జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు కిల్లంశెట్టి సాగర్, కార్యదర్శి మెట్ట ఆశోక్ కుమార్ అభినందించారు.

తప్పులు లేకుండా చూడాలి

ఇచ్ఛాపురం: ఓటరు జాబితాలో ఎటువంటి తప్పులు ఉన్నా తక్షణమే సరి చేయాలని ఆర్డీవో ఎస్.భరత్ నాయక్ అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గంలోని నాలుగు మండలాల తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 299 పోలింగ్ కేంద్రాల్లో 2,66,023 మంది ఓటర్లు ఉన్నారన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి ప్రశాంత ఎన్నికలకు సహకరించాలని కోరారు.

పేదల అభ్యున్నతే కేంద్రం ధ్యేయం

జి.సిగడాం: పేదల అభ్యున్నతే కేంద్రప్రభుత్వ ధ్యేయమని బీజేపీ మండల అధ్యక్షుడు, విశ్వకర్మ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ వజ్జపర్తి రఘురాం అన్నారు. బుధవారం గొబ్బూరు, డీఆర్ వలస గ్రామాల్లో వికసిత్ భారత సంకల్పయాత్ర ముగింపులో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మీసాల రామకృష్ణ, నాయకులు గట్టెం అప్పలరాజు, పొగిరి దాశరథి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా పరిరక్షించుకోవాలి

అరసవల్లి: ఎన్నికలు పూర్తయినంతవరకు ఓటర్ల జాబితాలను పరిరక్షించుకోవాలని దీనికి బూత్, యూనిట్, క్లస్టర్ ఇన్‌చార్జీలు బాధ్యత తీసుకోవాలని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పీఎంజే బాబు అన్నారు. బుధవారం విశాఖ జిల్లా టీడీపీ కార్యాలయంలో 'బాబు ష్యూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ' గ్యారెటీ శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని ఓటర్ల జాబితా వెరిఫికేషన్‌పై సభ్యులకు వివరించారు. పార్టీ నాయకులు బడేటి రాధాకృష్ణ, పీలా శ్రీనివాస్, సింతు సుధాకర్, విజయరాం పాల్గొన్నారు.

ఘనంగా హ్యాపీ డ్రైవర్స్ డే

అరసవల్లి: ఏపీఎస్ ఆర్టీసీ రహదారి భద్రతా మాసోత్సవం సందరన్బంగా జనవరి 24 బుధవారం డ్రైవర్స్ డేగా నిర్వహించారు. ఆర్టీసీ బస్సుల్లో నిత్యమూ లక్షలాది మంది ప్రయాణికులకు క్షేమంగా గమ్యస్థానాలకు చేరుస్తూ డ్రైవర్స్ వారికి భరోసాగా నిలుస్తున్నారు. ఈ సందర్భంగా బస్సుల్లో ప్రయాణించే ఉద్యోగులు, విద్యార్థులు, ఇతర ప్రయాణికులు డ్రైవర్లకు అభినందనలు తెలియజేయాలని 1వ, 2వ డిపో మేనేజర్లు పాల్గొన్నారు.

తెలగ కులస్థులను బీసీలో చేర్చాలి

సోంపేట: ఉత్తరాంధ్ర తెలగ కులస్థులను బీసీలో చేర్చాలని ఆ సంఘ నాయకులు బుధవారం తహసీల్దార్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. మండలంలో వేలలో తెలగ కులస్థులు ఉన్నారని ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడి ఉన్నారని తెలిపారు. చదువుకున్న యువతకు అవకాశాలు రావాలంటే బీసీలో చేర్చాలని కోరారు. వినతి పత్రం సమర్పించినవారిలో సర్వశెట్టి శ్రీను, ఇందుగు కిషోర్, అనుసూరి నారాయణ ఉన్నారు.

హైదరాబాదులో జిల్లా యువకుడి మృతి



పోతయ్య(ఫైల్)

రణస్థలం: కొవ్వాడ గ్రామానికి చెందిన మైలపల్లి పోతయ్య (23) హైదరాబాద్‌లో బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు పోతయ్య గత కొన్నేళ్లగా హైదరాబాద్‌లో రోడ్డు పక్కన చిన్న షాపుపెట్టుకొని టోపీలు, కళ్లద్దాలు విక్రయిస్తూ వ్యాపారం చేస్తో జీవితాన్ని వెళ్లబుచ్చుతున్నాడు. అయితే ఎప్పటిలాగే పోతయ్య ద్విచక్రవాహనంపై ఉదయం షాపు తీయడానికి వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన లారీ ఢీ కొంది. దీంతో పోతయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. పోతయ్యకు భార్య రాములమ్మ, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.

చోరీకి గురైన బైక్ గుర్తింపు

ఎచ్చెర్ల: ఫరీద్‌పేట పంచాయతీ నవభారత్ నగర్ కాలనీలో నివాసం ఉంటున్న శ్రీకాకుళం ట్రాఫిక్ పోలీసు స్టేషన్ కానిస్టేబుల్ పైడి శ్రీనివాసరావుకు చెందిన మోటారు బైక్ చోరీకి గురై.. అరిణాం అక్కివలస వద్ద జాతీయ రహదారి పక్కన బుధవారం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కానిస్టేబుల్ శ్రీనివాసరావు ఈ నెల 21న తన ఇంటి వద్ద బైక్‌ను ఉంచి.. మన్యం జిల్లాలోని శంబర జాతరలో విధుల నిర్వహణకు వెళ్లారు. తిరిగి ఈ నెల 24న వచ్చేసరికి ఇంటి ఆవరణలో పార్క్ చేసిన బైక్ కన్పించలేదు. సీసీ ఫుటేజీలను పరిశీలించగా.. ఈ నెల 21వ తేదీ రాత్రి చోరీకి గురైనట్టు గుర్తించారు. దీనిపై పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదు చేయగా.. అప్పటికే పోలీసులు అరిణాం అక్కివలస వద్ద స్వాధీనం చేసుకున్న బైక్ తనదేనని శ్రీనివాసరావు గుర్తించారు. ఇదే కాలనీలో ఇటీవల బుల్లెట్ చోరీకి గురైన విషయం తెలిసిందే. తరుచూ బైక్ దొంగతనాలు జరుగుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

చీటింగ్ కేసులో కానిస్టేబుల్‌పై వేటు?

శ్రీకాకుళం క్రైం: నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తానని నమ్మించి వారి నుంచి రూ.లక్షల్లో వసూలు చేసిన ఓ కానిస్టేబుల్‌ను విధుల నుంచి తొలగిస్తున్నట్టు ఉన్నతాధికారి కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడినట్టు తెలుస్తుంది. 2019లో వన్ టౌన్ పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న తరుణంలో కోర్టులో ఉద్యోగాలు ఇప్పిస్తానని శ్రీకాకుళం రూరల్ మండలం, ఆమదాలవలస, పొందూరు మండలాలకు చెందిన కొందరు నిరుద్యోగుల నుంచి సుమారు రూ.24 లక్షల వరకు వసూళ్లకు పాల్పడ్డాడు. దీనిపై ఒకటో పట్టణ పోలీసులతో పాటు ఎస్పీకి బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో 2023లో ఎస్పీ రాధికను బాధితులు ఆశ్రయించడంతో విచారణకు వన్ టౌన్ పోలీసులను ఆదేశించారు. దీంతో సదరు కానిస్టేబుల్‌పై ఎస్ఐ గణేష్ చీటింగ్ కేసు నమోదు చేశారు. ఈ కేసులో అధికారుల విచారణ అనంతరం నిరుద్యోగుల నుంచి నగదు వసూళ్లకు పాల్పడడం వాస్తవమని తేలడంతో ఎస్పీ రాధిక ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు. దీంతో సదరు కానిస్టేబుల్‌ను విధుల నుంచి తొలగిస్తున్నట్టు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చినట్టు పోలీసు వర్గాలు చెబుతున్నాయి.

30మంది ఎస్ఐలకు పదోన్నతి

శ్రీకాకుళం క్రైం: పోలీసు శాఖలో 30 మంది ఎస్ఐలకు సీఐలుగా పదోన్నతి కల్పిస్తూ విశాఖ రేంజ్ ఐజీ కార్యాలయం నుంచి బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. రోస్టర్ ప్రాతిపదికన విశాఖ రేంజ్ పరిధిలో ఎస్ఐలుగా పనిచేస్తున్న వారికి పదోన్నతి కల్పించారు. శ్రీకాకుళం రూరల్ ఎస్ఐ అంబటి విజయకుమార్, చింతాడ ప్రసాద్, ఊయక రమేష్, సీలవలస లక్ష్మణరావు, గుబ్బాల శ్రీనివాసరావులకు సీఐలుగా పదోన్నతి లభించింది. అలాగే ఇంటలిజెన్స్‌లో పనిచేస్తున్న బేసి లక్ష్మణరావు, త్రిపురాన కాంతి కుమార్, కెలంగి జీవన్‌కాంత్, వెలగాడ శంకరరావు, కూన మల్లేశ్వరరావు, వానపల్లి రామారావు, వేచలపు నారాయణమూర్తికి పదోన్నతి లభించింది. అనకాపల్లి జిల్లాలో పనిచేస్తున్న బూరాడ అప్పలనాయుడు, దుంపల దీనబంధు, సామంతుల సన్యాసినాయుడు, సీఐడీలో ఉన్న వానపల్లి నాగరాజు, గొల్లు అర్జున, గిడిజల మల్లేశ్వరి, బోరపు మంగరాజు, విశాఖ సిటీ ఎస్ఐలు లొడ్డు రామకృష్ణ, ఎస్.సోమరాజు, కల్లూరి శ్రీనివాసరావు రైల్వేలో ఎస్ఐలుగా పనిచేస్తున్న తోటాడ కామేశ్వరరావు, బమ్మిడి అప్పలనాయుడు, విజయనగరం పీటీసీలో పనిచేస్తున్న కింతలల నారాయణరావు, ముదిలి శ్రీనివాసరావు, గేదెల బాలకృష్ణ, మెరెయిన్ సీఎస్‌పీఎస్ అమిటి ప్రసాదరావు, ఏపీ ట్రాన్స్‌కో ఎస్ఐ మడ్డు శ్రీను, ఏసీబీ నుంచి మీసాల చిన్నంనాయుడులకు సీఐ పదోన్నతులు వచ్చాయి. వీరందరికి పోలీసు స్టేషన్లు కేటాయించే వరకు ప్రస్తుతం వారు పనిచేస్తున్న పోలీసు స్టేషన్‌లో కొనసాగుతారు.

జెండా కాదు.. అజెండా ముఖ్యం

కంచిలి: రైతాంగానికి ప్రధానమైన సాగునీటి కల్పనకు నదుల అనుసంధానం చేయాలని పలువురు వక్తలు అన్నారు. అంపురం జంక్షన్ వద్ద రైతుకులం సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఏఎస్ శర్మ, పలువురు వక్తలు మాట్లాడుతూ.. రాజకీయాలకు అతీతంగా సాగునీటి కల్పనే ప్రధాన అజెండాగా రైతులంతా సంఘటితమవ్వాలన్నారు. జిల్లాలోని వంశధార, నాగావళి తదితర నదుల నుంచి ఇచ్ఛాపురం నియోజకవర్గ రైతాంగానికి కావాల్సిన సాగునీరందించేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. వెనుకబడిన ప్రాంతంగా ఉన్న ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాల రైతులకు ఇప్పటి వరకు పాలించిన ప్రభుత్వాలు చిన్నచూపు చూశాయని, ఇప్పటికైనా రాజకీయ పార్టీలు సాగునీటి వనరుల కల్పనకు కార్యాచరణతో ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ సంఘం అధ్యక్షుడు వై.కృష్ణమూర్తి, ఎమ్మెల్సీ నర్తు రామారావు, రిటైర్డు డీఎస్పీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు భూ హక్కులు కల్పించాలి

సరుబుజ్జిలి: చిగురువలస గ్రామ సచివాలయ పరిధిలో వెన్నెలవలస రిజర్వాయర్ వద్ద ఉన్న బసవమామిడివలస గిరిజన రైతులకు భూ హక్కులు కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ కోరారు. బుధవారం ఆయన సరుబుజ్జిలి తహసీల్దార్ కార్యాలయంలో బసవ మామిడివలసకు చెందిన సవర సింహాచలం, సవర ధర్మారావు, సవర శ్రీనివాసరావు, సవర వసంతరావు, సవర చిన్న చుక్కలమ్మలతో కలిసి తహసీల్దార్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందించారు.

యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన



మోకాళ్లపై నిల్చొని నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

అరసవల్లి: యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం పట్టణంలో యూటీఎఫ్ కార్యాలయం నుంచి రైతుబజార్ జంక్షన్ మీదుగా స్థానిక డే అండ్ నైట్ కూడలి, మీదుగా ఏడురోడ్ల జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఏడురోడ్ల జంక్షన్ వద్ద మోకాళ్లపై కూర్చుని నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, ఎస్.కిషోర్‌కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చౌదరి రవీంద్ర మాట్లాడుతూ.. 30 శాతం మధ్యంతర భృతిని చెల్లించాలని, పెండింగ్ బకాయిలను వెంటనే క్లియర్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బి.శ్రీరామ్మూర్తి, అధ్యక్షుడు ఎల్.బాబూరావు, సహాధ్యక్షుడు బి.ధనలక్ష్మి, కోశాధికారి బి.రవికుమార్, జిల్లా కార్యదర్శి హెచ్.అన్నాజీరావు, బి.శంకరరావు, పి.సూర్యప్రకాశరావు, శ్రీరామచంద్రమూర్తి, పి.మురళీధరరావు, జి.సురేష్, రాష్ట్ర కౌన్సిలర్లు అప్పారావు, ఎస్.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యాలయంలో వేలం పాట ఖరారు

అరసవల్లి: ఆరోగ్య ప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి దేవస్థానంలో ఫిబ్రవరి 16న జరగనున్న రథసప్తమి వేడుకల సంబంధించి బుధవారం సీల్డ్ టెండర్ కమ్ బహిరంగ వేలం పాట నిర్వహించారు. ఇందులో క్యూలైన్ల ఏర్పాటుకు పిల్లా మౌళి రూ.2,10,000, విద్యుత్తు దీపాలంకరణకు ఉంగటి పాపారావు రూ.3,00,000, షామియానాలు, కార్పెట్లు వేసేందుకు కె.గోవింద్ రూ.2,60,000, రంగులు వేసేందుకు గోపి రూ.2,20,000 పాట ఖరారు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వి.హరిసూర్యప్రకాష్, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, పాలకమండలి ఛైర్మన్ ఇప్పిలి జోగి సన్యాసిరావు, పాలకమండలి సభ్యుడు జలగడుగుల శ్రీనివాసరావు, శ్రీకూర్మం దేవస్థానం ఈవో జి.గురునాథం పాల్గొన్నారు. తలనీలాలకు సంబంధించిన వేలం పాటలో గతేడాది కంటే తక్కువ నమోదు కావడం వల్ల పాట వాయిదా వేసినట్టు ఈవో తెలిపారు.

నృత్య ప్రదర్శనకు చిన్నారుల ఎంపిక



కళాకారులను అభినందిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం: హైదరాబాదు బాలత్రిపుర సుందరి నృత్య కళానిలయం ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కళాతరంగిణి నాట్య, వాద్య, సంగీత కళా ప్రదర్శనలు ఈ నెల 26న జరగనున్నాయి. ఈ ప్రదర్శనలో పాల్గొన్న కళాకారులకు ప్రత్యేక అవార్డులు ప్రదానం చేయనున్నారు. ఈ ప్రదర్శకు ఇచ్ఛాపురం స్వేచ్ఛ నృత్య తరంగిణి కూచిపూడి, భరతనాట్యం, జానపద శిక్షణాలయం చిన్నారులు కె.కుమార్, పి.వర్షిత, ఎం.తేజశ్రీ, డి.జ్ఞానేశ్వరి, డి.ఉపాసన, ఎస్.లావణ్య, బి.అనుశ్రీ, ఎస్.లాస్య, బి.శ్రీవల్లిక, బి.రోషిని, సాయి, దీపన్విత, కావ్యశ్రీ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వారికి అకాడమీ అధ్యక్షుడు కె.గోవిందరావు, ఎం.దాలమ్మ అభినందించారు.

జిల్లా స్థాయి క్రికెట్ విజేత ఆర్.బెలగాం



ట్రోఫీ అందుకుంటున్న విజేత జట్టు

కవిటి: డి.గొనపపుట్టుగ గ్రామంలోని నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ పోటీల్లో విజేతగా ఆర్.బెలగాం జట్టు నిలిచింది. ప్రతిభా యువజన సంఘం ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. చివరిరోజు బుధవారం విజేతలకు బహుమతులను అందించారు. విజేతగా నిలిచిన ఆర్.బెలగాం జట్టుకు రూ.20వేలుతో పాటు ట్రోఫీని అందించారు. రెండో స్థానాన్ని డి.గొనపపుట్టుగ జట్టు కైవసం చేసుకుంది. కార్యక్రమంలో సర్పంచ్ బి.కిరణ్‌కుమారి, ఎంపీటీసీ పూర్ణచంద్రుడు, గ్రామస్థులు కె.లోకనాథం, కె.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టాలి

ఆమదాలవలస: గ్రామ సచివాలయాల్లో త్వరలో చేపట్టనున్న పేదలందరికీ ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను సక్రమంగా చేపట్టాలని జిల్లా రిజిస్ట్రార్ కిల్లి మన్మధరావు అన్నారు. బుధవారం ఆమదాలవలస సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పేదలందరికీ ఇళ్ల రిజిస్ట్రేషన్‌పై సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించారు. ప్రభుత్వం ఇటీవల పేదలకు మంజూరు చేసిన ఇంటి స్థలాలను కొత్తగా ఏర్పాటు చేసిన గ్రామ, వార్డు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ నెల 27వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్ ప్రారంభించనున్న సచివాలయ కార్యదర్శులు, వీఆర్వోలు, డిజిటల్ అసిస్టెంట్లు బాధ్యతగా నిర్వహించాలన్నారు. సబ్ రిజిస్ట్రార్ బి.అరుణ, సీనియర్ అసిస్టెంట్ కె.రాజేష్‌బాబు, ఆమదాలవలస, సరుబుజ్జిలి, బూర్జ, ఎల్ఎన్ పేట, సచివాలయ కార్యదర్శులు, వీఆర్వోలు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వందరోజుల పని కల్పించాలి

రణస్థలం: ఉపాధి వేతనదారులకు వంద రోజులు పనులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ జీవీ చిట్టిరాజు స్పష్టం చేశారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణంలో నిర్వహించిన ఉపాధి పథకం సామాజిక తనిఖీ ప్రజావేదికలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి పథకం, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా 1389 పనులకు గాను సుమారు రూ.25.4 కోట్లు ఖర్చు చేసినట్టు వెల్లడించారు. మెంటాడ పంచాయతీ ఉపాధి పనుల్లో మృతి చెందినవారి పేర్లు మీద హాజరు వేసినట్టు గుర్తించామని, ఆ సొమ్ములు రికవరీ చేయాలని సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఆదేశించారు.

ఉద్యోగినులకు భద్రత అవసరం



ఎచ్చెర్ల: పనిచేసే ప్రదేశాల్లో ఉద్యోగినులకు మరింత భద్రత అవసరమని వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ విశాఖ జిల్లా సభ్యురాలు రఫీ మున్నియా బేగం అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జాతీయ బాలిక దినోత్సవంలో భాగంగా ఉద్యోగినులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలకు భద్రత కల్పించే పోక్సో చట్టంపై వివరించారు. మహిళల హక్కులను పరిరక్షించేలా సురక్షిత వాతావరణం కల్పించాలన్నారు. కార్యక్రమంలో వీసీ కేఆర్ రజని, రిజిస్ట్రార్ బిడ్డిక అడ్డయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే వర్సిటీలో ఇంగ్లీష్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న పైల రవికుమార్‌తో పాటు మరో ముగ్గురు అధ్యాపకులు రచించిన టీచింగ్ ఫోనెటిక్స్ ఇన్ ఇండియన్ కాంటెస్ట్ అనే పుస్తకాన్ని వీసీ ఆవిష్కరించారు. రిజిస్ట్రార్ బిడ్డిక అడ్డయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎచ్చెర్లలోని అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల/కళాశాల ఆవరణలో బాలల రక్షణ విభాగం ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.లక్ష్మి, సోషల్ వర్కర్ శ్రీనివాసరావు, ఎస్ఐ వెంకటరావు, ఎ.గీత, చైల్డ్ లైన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో అగ్నిమాపక శాఖ ఏడీ

అరసవల్లి: ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారిని బుధవారం అగ్నిమాపక శాఖ ఏడీ జ్ఞాన సుందరం దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వాగతం పలుకగా, అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. స్వామివారి జ్ఞాపికన అందజేశారు.

క్రమశిక్షణతో చదవాలి



గంగాధర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం క్రైం: క్రమశిక్షణతో చదివి ఉత్తమ పౌరులుగా ఎదగాలని మీనాక్షి హాస్పిటల్ వైద్యుడు గొండు గంగాధర్, డీఈవో కె.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. రూరల్ మండలం సింగుపురం గ్రామంలో ఉన్న గుండ ప్రశాంతి ఎడ్యుకేషనల్ సొసైటీ వారి క్రాంతి విద్యానికేతన్ రజతోత్సవ వేడుకలు బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా వారు పాల్గొని మాట్లాడారు. క్రాంతి విద్యానికేతన్ కరస్పాండెంట్ గుండ అమ్మడు రూపొందించిన రజతోత్సవ పుస్తకాన్ని వారు ఆవిష్కరించారు. అనంతరం గొండు గంగాదర్‌ను డీఈవో వెంకటేశ్వరరావును సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో నక్క గణపతి, పి.మల్లేశ్వరరావు, బగ్గు రాంబాబు, ఐఏసీ డైరెక్టర్ బీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

డీ-పట్టా రద్దు చేయండి

బూర్జ: తోటవాడ గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు గుమ్మడి రాంబాబుకు ఇటీవల రెవెన్యూశాఖ ఇచ్చిన డీ-పట్టాను రద్దు చేసి న్యాయం చేయాలని తోటవాడ గ్రామానికి చెందిన దళితులు తహసీల్దార్‌కు మొరపెట్టుకున్నారు. మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ ఆధ్వర్యంలో తహసీల్దార్ ఎస్.రమణారావుకు వినతిపత్రాన్ని అందించారు. దాదాపు 15 ఏళ్లగా తోటవాడ పరిధిలోని సర్వే నెంబరు 397లో ఉన్న 2.5 ఎకరాల కొండ ప్రాంతాన్ని సాగు చేస్తూ దళితులంతా జీవనం సాగిస్తున్నామన్నారు. వాటిని అధికార పార్టీకి చెందిన ఒక నాయకుడి భార్య పేరు మీద ఇటీవల డీ పట్టా ఇవ్వడంతో తామంతా జీవనం కోల్పోయామని వినతిపత్రంలో పేర్కొన్నారు. దళితులకు అన్యాయం జరిగితే సహించేది లేదని రవికుమార్ అన్నారు. ఆయనతో పాటు టీడీపీ నాయకులు ఉన్నారు. ప్రభుత్వ భూమిని వైకాపా నాయకులకు కాకుండా పేదలకు మా త్రమే ఇవ్వాలని రవికుమార్ తహశీల్దార్ రమణారావుఉ కోరారు.

గిరిజన గ్రామాల సందర్శన



గిరిజన గ్రామాలకు వెళ్తున్న అటవీ అధికారులు

కంచిలి: కేబీ నౌగాం, భువనపురం తదితర గిరిజన గ్రామాలను అటవీ అధికారులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, గిరిజనుల వినతి మేరకు వరాహ లక్ష్మీ నరసింహ దేవస్థానానికి వెళ్లేందుకు నడక దారి లేనందున సిమెంటు రహదారి ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అటవీ శాఖ రేంజ్ అధికారి కె.మురళీకృష్ణంనాయిడు, ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి, రాము, భాను, కొనపల సురేష్, గిరిజనులు పాల్గొన్నారు.

కబడ్డీలో సత్తాచాటిన క్రీడాకారులు

శ్రీకాకుళం స్పోర్ట్స్: రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లాకు చెందిన బాలబాలికలు సత్తాచాటి, పలువురు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కర్నూలు జిల్లా నంద్యాల్లో జరిగిన 49వ రాష్ట్రస్థాయి కబడ్డీలో జిల్లాకు చెందిన బాలికలు ద్వితీయస్థానం, బాలురు తృతీయ స్థానాల్లో నిలిచారు. బాలికల విభాగంలో ముగ్గురు, బాలుర విభాగంలో ఇద్దరు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను కబడ్డీ జిల్లా అసోసియేషన్ ఛైర్మన్ సీదిరి అప్పలరాజు, కార్యదర్శి సాధు శ్రీనివాసరావు, ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ తదితరులు అభినందించారు.

పోలీసు అధికారులకు పతకాలు



అవార్డులు అందుకుంటున్న సీఐలు ఇమాన్యుయల్, సాయి

శ్రీకాకుళం క్రైం: పోలీసు శాఖలో ఉత్తమ సేవలు అందించిన అధికారులకు బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డు-2023లను ప్రభుత్వం ప్రకటించారు. ఈ మేరకు బుధవారం విశాఖలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అడిషనల్ డీజీపీ ఎ.రవి కుమార్ అవార్డులు ప్రదానం చేశారు. విశాఖలో విధులు నిర్వహిస్తున్న సందర్భంలో బెస్ట్ ఇన్విస్టిగేషన్ అధికారిగా ఇచ్ఛాపురం సీఐ టి.ఇమాన్యుయల్‌కి పురస్కారం లభించింది. అలాగే బెస్ట్ లా అండ్ ఆర్డర్ పోలీసుస్టేషన్‌గా కంచరపాలెం సీఐగా విధులు నిర్వహించిన పాతపట్నం సీఐ ఎస్.సాయికి అవార్డులు వరించాయి. వీరికి అవార్డులు రావడంపై ఎస్పీ రాధిక అభినందనలు తెలిపారు.